

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

చేవెళ్ల, జూలై 18 : విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో సాయిరామ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించి జిల్లాలో రూ.730 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే కలెక్టరేట్‌లను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సమీర్, చందు, నిఖిల్, ఆదిత్య, సందీప్, మణి, నవీన్, చరణ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు



రైతుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. ఉత్సాహంగా ర్యాలీలు నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇదంతా జిల్లాలో గురువారం నెలకొన్న వాతావరణం. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీలో భాగంగా గురువారం రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆ డబ్బును జమ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. తాము సాగుకోసం తీసుకున్న రుణం ఒకేసారి మాఫీ కావడం పట్ల సంతోషం వెలిబుచ్చారు.

ఆనందహేల!



రుణమాఫీతో షాద్‌నగర్‌లో నృత్యం చేస్తున్న రైతు

ఈ మండలాల్లో ఒక్కరికే..

రైతు రుణమాఫీ పథకం కింద తొలివిడత లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తే రాజేంద్రనగర్, హయత్‌నగర్ మండలాల్లో అత్యల్పంగా రైతుల సంఖ్య నమోదైంది. ఈ రెండు మండలాల్లో ఒక్కో రైతుకు మాత్రమే లబ్ధి చేకూరింది. రాజేంద్రనగర్‌లో ఒక రైతుకు రూ.6,8670 మాఫీ కాగా, హయత్‌నగర్‌లో మరో రైతుకు రూ.83,671 మాఫీ అయ్యింది. ఇక గండిపేట మండలంలో 29మంది. అబ్దుల్లాపూర్‌మెట్‌లో 311 మంది. కొత్తూరులో 968 మంది రైతులకు రుణమాఫీ చేశారు. ఇక, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్ మండలాల్లో పెద్దగా వ్యవసాయం లేనందున ఇక్కడ రైతులు కూడా లేరు. మొత్తంగా జిల్లాలో గురువారం 25 మండలాల రైతులకు రుణమాఫీ జరిగింది.

రుణమాఫీతో రైతుల్లో సంబురం

- రూ.లక్షలోపు రుణాలున్న రైతులందరికీ మాఫీ
- జిల్లాలో 49,741 మందికి లబ్ధి
- 12మంది జిల్లా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి చెక్‌ల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, పాలాభిషేకాలు
- భారీగా పాల్గొన్న రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు
- రాజేంద్రనగర్, హయత్‌నగర్ మండలాల్లో ఒక్కో రైతుకు లబ్ధి
- మల్కారం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శశాంక

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియను గురువారం అట్టహాసంగా ఆరంభించింది. ముందు ప్రకటించిన విధంగానే తొలి విడత రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ గురువారం దిగ్విజయంగా పూర్తి చేసింది. జిల్లాలోని 49,741 మంది రైతులకు రూ.లక్ష లోపు రూ.278.06కోట్ల రుణాలను గురువారం ఒకేరోజు ప్రభుత్వం మాఫీ చేసింది. రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని పలుచోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు పండుగ వాతావరణంలా నిర్వహించారు. అన్ని రైతువేదికల వద్ద రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సచివాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన 12 మంది రైతులకు రుణమాఫీ చెక్‌లు అందజేశారు. ఇందులో ఆరుగురు మహిళా రైతులు ఉన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికల వద్ద ఉన్న రైతులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనేక చోట్ల ర్యాలీలు నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. అలాగే పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శంషాబాద్ మండలం మల్కారంలో నిర్వహించిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శశాంక పాల్గొన్నారు. తొలివిడత రెతు రుణమాఫీ కింద జిల్లాలో మొత్తం 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్లు మాఫీ అయింది. ఇందులో అత్యధికంగా షాద్‌నగర్, ఆమన్‌గల్ డివిజన్లలో రైతులకు లబ్ధి చేకూరింది. అత్యధికంగా షాద్‌నగర్ డివిజన్‌లో 13,467మంది రైతులకు రూ.75.64 కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే ఆమన్‌గల్ డివిజన్‌లో 12,486 మంది రైతులకు రూ.75.30కోట్ల రుణమాఫీ చేశారు. అతి తక్కువగా రాజేంద్రనగర్ డివిజన్‌లో 1,058 మంది రైతులకు రూ.5.04కోట్ల రుణమాఫీ చేశారు.



మంచాలలో రుణమాఫీపై సీఎం ప్రోగ్రాంను వీక్షిస్తున్న రైతులు

డివిజన్ల వారీగా రుణమాఫీ వివరాలు

డివిజన్	రైతుల సంఖ్య	మాఫీ అయిన రుణం
ఆమన్‌గల్	12,486	75,30,88,817
చేవెళ్ల	10,134	54,62,31,987
ఇబ్రహీంపట్నం	7,601	40,63,26,042
మహేశ్వరం	5,000	26,81,29,319
రాజేంద్రనగర్	1,058	05,04,53,648
షాద్‌నగర్	13,467	75,64,33,287



ఆమనగల్లులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

సీఎం చేతుల మీదుగా చెక్కులు అందుకున్న రైతులు

సచివాలయంలో జరిగిన తొలివిడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాకు చెందిన 12మంది రైతులకు రుణమాఫీ చెక్కులను స్వయంగా అందజేశారు. ఇందులో ఆరుగురు మహిళా రైతులు ఉన్నారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన మల్లిపెద్ది చెన్నమ్మ, చౌలపల్లికి చెందిన జె.శంకర్, జిల్లెల చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లకు చెందిన కె.మల్లేష్, కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన జి చెన్నయ్యలు రుణమాఫీ చెక్‌లు అందుకున్నారు. వీరితో పాటు కందుకూరు మండలం లేమూరుకు చెందిన చింతకంది భిక్షపతి, గూడూరుకు చెందిన బండి జగదాంబ, గుమ్మడివెల్లికి చెందిన సబావత్ చందర్, ముచ్చెర్లకు చెందిన ఎర్ర అండాళ్లు, మహేశ్వరం మండలం తుమ్మలూరుకు చెందిన ఎం.యాదయ్య, కడ్తాల్ మండలం ముక్తమాధారానికి చెందిన ఎ.శారద, ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన వి.ఆండాళ్లు, శంకరపల్లి మండలం గోపులారం గ్రామానికి చెందిన ఎం.మాణిక్యరెడ్డికి రుణమాఫీ చెక్‌లు సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు.

సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి: డీఏఓ

పంట రుణమాఫీ పథకం 2024కి సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు 040-24547507 ఫక్షన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ సొమ్ము

జిల్లాకేంద్రం, అన్ని బ్యాంకుల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

డీసీసీ-డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 18 : రుణమాఫీ సొమ్ము నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమవుతుందని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ, సహకార, బ్యాంకర్లతో కలిసి రైతు రుణమాఫీలో తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీ-డీఎల్ఆర్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా చేపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు 2018 డిసెంబర్ 12 లేదా ఆ తరువాత మంజూరయిన లేక రెన్యువల్ అయిన రుణాలకు, 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. మొదటి విడత రూ.లక్ష వరకు, రెండవ విడత రూ.1.50 లక్షలు, మూడో విడతలో రూ. 2 లక్షలు, దశలవారీగా రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 49,741 మంది రైతులకు రూ. లక్ష లోపు రుణమాఫీ ద్వారా రూ. 278.6 కోట్లు చెల్లించినట్టు కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లాలోని బ్యాంకులు, సహకార శాఖ బ్యాంకులు, సహకార శాఖ సొసైటీల ద్వారా రైతులకు నేరుగా రైతుల ఖాతాలలో రుణమాఫీ సొమ్ము జమవుతుందన్నారు. ప్రతీ బ్యాంకుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రుణమాఫీలో ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో, మండల స్పెషల్ ఆఫీసర్లను, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను సంప్రదించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ శశాంక మాట్లాడుతూ రైతులకు వానాకాలం, యాసంగి సాగుకు సకాలంలో పంట రుణాలు చెల్లించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి నుంచి లక్ష రూపాయల రుణమాఫీ చెక్కులు అందుకుంటున్న రైతులు

ఎనిమిదేళ్ల బాలిక అపహరణ

స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ఘటన

పప్పా బులారే అంటూ పిలిచి బాలికను తీసుకెళ్లిన ఆగంతకుడు

కొత్తూర్ మండల కేంద్రంలో ఘటన

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు.. పోలీసుల ముమ్మర గాలింపు



కాజోల్ సింగ్

కొత్తూర్, జూలై 18 : ఇంటి ముందు స్నేహితులతో ఆడుకుంటుండగా.. అటుగా వచ్చిన ఓ వ్యక్తి పప్పా బులారే అంటూ మాయమాటలు చెప్పి బాలికను అపహరించుకపోయాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కాలనీవాసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన సంజయ్‌సింగ్, అతని భార్య సుమిత్రలు కూతురు, కుమారుడితో కలిసి రెండు సంవత్సరాల క్రితం కొత్తూర్‌కు వలస వచ్చి ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సంజయ్‌సింగ్‌తో పాటు అతని భార్య స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో దినసరి కార్మికులుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమార్తె కాజోల్‌సింగ్(8), కుమారుడు కునాల్‌సింగ్(5) ఉన్నారు. కూతురు కాజోల్‌సింగ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. గురువారం ఇంటి ముందు స్నేహితులతో కలిసి కాజోల్‌సింగ్ ఆడుకుంటుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పప్పా బులారే అంటూ కాజోల్‌సింగ్‌ను పిలిచాడు. కాజోల్‌సింగ్ వెంటనే అతడి దగ్గరకు వెళ్లింది. దీంతో అతడు బాలికను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని కాజోల్‌సింగ్ స్నేహితులు వారి కుటుంబ సభ్యులకు తెలుపగా.. వారు బాలిక కోసం సమీప ప్రాంతాల్లో వెతికారు. అరగంట పాటు వెతికినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న కాలనీవాసులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్సై జి. శ్రీనివాస్ సిబ్బందితో కాలనీకి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో పాటు, కాలనీవాసులను సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ నుంచి పాత జాతీయ రహదారి వరకు ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. బాలిక ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపులు ముమ్మరం చేశారు. బాలిక అపహరణతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలిక తల్లి సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

ఉన్నత విద్యతో పాటు క్రీడలూ అవసరమే

- కలెక్టర్ శశాంక
- వాలీబాల్ పోటీలో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన

రంగారెడ్డి అర్బన్, జూలై 18 : విద్యార్థులకు ఉన్నత విద్య ఎంత అవసరమో క్రీడలూ అంతే అవసరమని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా హనుమకొండ రంగశాయిపేటలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వాసవి జూనియర్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ గురువారం వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు, విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించే క్రీడ, సైన్స్ ఎగ్జిబిషన్‌లు, కల్చరల్ యాక్టివిటీస్‌లో భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వాసవి కళాశాల ప్రిన్సిపాల్ మంగులాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందా చేస్తే బేడీలే!

- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్
- శంషాబాద్‌లో 30క్వింటాళ్ల బియ్యం సీజ్, కేసు నమోదు



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో నిందితులు

రంగారెడ్డి అర్బన్, జూలై 18 : రేషన్ బియ్యం దందా చేసే అక్రమార్కులపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. గురువారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడుగా రేషన్ విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు. 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ నుంచి మామిడిపల్లి మార్గంలో కొంత కాలంగా శంషాబాద్‌కు చెందిన ఆర్బాజ్, ఇంతియాజ్ మరికొందరి సాయంతో రేషన్ బియ్యం సేకరించి అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు. సమాచారం తెలుసుకుని రహస్య స్థావరంపై దాడి చేసినట్లు రఘునందన్ చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని శంషాబాద్ పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనంతో పాటు నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద చిరిగిపోయిన జాతీయ జెండా

జాతీయ జెండాను పట్టించుకోండి!



ఇబ్రహీంపట్నం, జూలై 18: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టపై ప్రధాన తూము వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఈదురు గాలులకు చినిగి పేలికలుగా తయారైంది. ఓ జెండా తూము గుమ్మటంపై ఏర్పాటు చేయగా మరోటి తూము ముందు భాగంలో ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. అంతేగాకుండా చెరువు నీటి అలలు, అందాలను చూడటానికి జనం వస్తుంటారు. అధికారులెవరూ ఈ జెండాలను గమనించలేదా.. లేక పట్టించుకోకుండా ఉన్నారా అన్న చర్చ స్థానికంగా సాగుతోంది.



చేవెళ్ల మోడల్ స్కూల్‌లో మాక్‌పోలింగ్ చూపిస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా విద్యార్థుల మాక్ పోలింగ్

చేవెళ్ల, జూలై 18 : పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎం ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి పర్యవేక్షణలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగించారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవులకు 42 మంది విద్యార్థులు నామినేషన్ వేయగా ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు. ఆరుగులు విత్‌డ్రా చేసుకున్నారు. పోటీలో నిల్చిన విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఓటు వేశారు. ఉపాధ్యాయులు మల్లేశ్వరి, ప్రసన్నకుమారి, శ్రీదేవి, సుధీర్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడికి ఐఐటీలో సీటు

బొంరాస్‌పేట్, జూలై 18: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో దుద్యాల గ్రామ పరిధి లోని రక్తమైసమ్మ తండాకు చెందిన జాదవ్ అర్జున్ సీటు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అర్జున్ జడ్పీహెచ్ఎస్ దుద్యాల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. తండ్రి రామునాయక్ ఇటుక బట్టీలో పని చేస్తూ కుమారుడిని చదివించాడు. తండ్రి కష్టాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఐఐటీలో రసాయనశాస్త్రం విభాగంలో సీటు సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు జాలాది

ఘట్‌కేసర్, జూలై 18: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి శక్తివంచనలేకుండా శ్రమించాలని విద్యావేత్త మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు జాలాది అన్నారు. కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విభాగం ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా కళాశాల అధ్యాపక బృందం నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రపంచంలో విస్తరిస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. నేటి విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శివకేశవరెడ్డి, సైకాలజిస్టు అభిషేక్ సింగంశెట్టి, సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జరుపుల మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న శ్రీకృష్ణదేవరావ్, అనిల్‌మింజ్

శామీర్‌పేట, జూలై 18: సమాజంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నల్సార్ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ పిలుపునిచ్చారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ ఆవరణలో గురువారం రంగారెడ్డి సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ఆధ్వర్యంలో అధికారులు, జవాన్లు, విద్యార్థులు, వైస్ ఛాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ వనమహోత్సవాన్ని నిర్వహించి పెద్దఎత్తున మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు చెందిన వంద మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సింధు, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెర్ సీఆర్ బురరాక్, అసిస్టెంట్ కామాండెంట్లు మారుతీ నాయక్, వినయ్‌రెడ్డి, అశ్విని, సుబేదార్ కార్తీకేయన్ మొక్కలు నాటారు.

బీరోల్ గ్రామ నక్షరోడ్డు పరిశీలన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతి

బంట్వారం (కోట్‌పల్లి) జూలై 18: బీరోల్ గ్రామ నక్ష రోడ్డును గురువారం వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత సోమవారం ప్రజావాణిలో గ్రామానికి చెందిన రైతులు వారి పొలాలకు వెళ్లే నక్ష రోడ్డును కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రైతుల పొలాలకు వెళ్లే నక్ష రోడ్డును తహసీల్దార్, సర్వేయర్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. నక్ష రోడ్డును కబ్జా చేస్తే చర్యలు తప్పవని తెలిపారు. వెంటనే సర్వేచేసి సమస్యను పరిశీలించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఆశజ్యోతి, సర్వేయర్ రమేష్ తదితరులు ఉన్నారు.

'వికారాబాద్‌కు త్వరలో నిధులు'

వికారాబాద్, జూలై 18: వికారాబాద్‌కు త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, మున్సిపాలిటీ అభివృద్ధిలో పరుగులు పెట్టనుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు మునిసిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో గురువారం స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులు కేటాయించాలని స్పీకర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అతి త్వరలో వికారాబాద్ అభివృద్ధికి కావాల్సిన నిధులు సమకూరబోతున్నాయని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల, జూలై 18 : గ్రామాల్లో వీధికుక్కల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు చేవెళ్ల ఎంపీడీవో హిమబిందును కలిసి వినతిపత్రం అందించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎక్కడ చూసినా వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి చిన్నపిల్లలు, మహిళలు భయపడుతున్నారని పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అశోక్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, నితీష్, భాస్కర్, జయసింహ రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

సబితారెడ్డిని విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న లక్ష్మయ్య

మహేశ్వరం, జూలై 18 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని, ఆమెను విమర్శించే అర్హత తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్‌కు లేదని బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జల్లెల లక్ష్మయ్య అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సబితారెడ్డి బిక్షతో చైర్మన్ అయిన మధుమోహన్.. తన స్వార్ధ రాజకీయాలకోసం పార్టీ మారి, ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరిస్తూ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అని కూడా చూడకుండా స్థాయికి మించిన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇకనుంచి ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. నాయకులు పి.సురేష్, బుచ్చిరెడ్డి, సామేల్‌రాజు, బండ మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా మహ్మద్ సలీం



రంగారెడ్డి అర్బన్, జూలై 18 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా మహ్మద్ సలీంను నియమించారు. ఈమేరకు ఆలిండియా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ గురువారం మహ్మద్ సలీంకు నియామక పత్రాన్ని అందించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటు పడాలని మధుయాష్కీగౌడ్ సూచించారు.



ఈతమొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

తలకొండపల్లి, జూలై 18: వనమహోత్సవంలో భాగంగా ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ పిలుపు నిచ్చారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో 20 వేల ఈత, తాటి, కర్జూరం మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం బదునాపూర్‌లో గురువారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. గ్రామ రైతులు కృష్ణగౌడ్, శివగౌడ్ వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ బద్యనాథ్ చౌహాన్ పాల్గొని రైతులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి వెయ్యి ఈతమొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది, శంకర్, బాబు, లోయ, తదితరులు పాల్గొన్నారు.



ఫకీరప్పను సన్మానిస్తున్న వికారాబాద్ యూనియన్ నాయకులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

వికారాబాద్, జూలై 18: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పకీరప్ప తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికై మొదటిసారి వికారాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ఆర్ఎం.గిరీశ్వర్ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి కుమ్మరి రాఘవేందర్, నాయకులు మహేష్, అశోక్, శ్రీకాంత్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా రమేశ్

పరిగి, జూలై 18: ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా పరిగి ప్రాంతానికి చెందిన అప్పగళ్ల రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాతంగి ఓదేలు మాదిగ నియామకపు పత్రాన్ని అందజేశారు. రమేశ్ గతంలో పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపితానికి కృషి చేశారు. రమేశ్ ఎమ్మార్పీస్ సేవలను గుర్తించి జిల్లా కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, జిల్లా కన్వీనర్‌గా నియమించడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్ కమిటీలు వేసి సంఘం బలోపితానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనమివ్వాలి

ఇబ్రహీంపట్నం, జూలై 18: ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని కోరుతూ గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మంది ఆశాలు ఏళ్ల తరబడిగా గ్రామాల్లో సేవలందిస్తున్నా.. ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయంటూ ఆందోళన వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రమందజేశారు. సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, బుగ్గరాములు, ఎల్లేష్, చందునాయక్, చంద్రకళ, మణెమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి

ఆమనగల్లు : ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలతో పాటు ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, మండలాల ఆశా కార్యకర్తలు గురువారం తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి వీలైనంత పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జె.పెంటయ్య, జిల్లా నాయకులు శివరాములు, కవిత, శిరీష, గీత, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రమందజేస్తున్న ఆశాలు

ఎంపీగారూ.. తాండూరు సమస్యలు తీర్చండి



తాండూరు, జూలై 18: చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన తర్వాత ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మొదటి సారి తాండూరుకు శుక్రవారం వస్తున్నారు. ఇక్కడ పలు ప్రధానమైన సమస్యలు కేంద్రంతో ముడిపడి ఉన్నాయి. ఈ సమస్యలపై ఎంపీ ప్రత్యేక దృష్టి పెట్టాలని తాండూరు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. తాండూరు కందిపప్పుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా కంది పంటను పండిస్తున్న తాండూరు ప్రాంతమే. అలాంటి కంది పప్పుకు కంది బోర్డును ఏర్పాటు చేయాలని దశాబ్ధకాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పసుపు బోర్డు ఏర్పాటైయిన విషయం విదితమే. అదే తరహాలో తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు ఎంపీ కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా తాండూరు రైల్వేస్టేషన్‌లో గరీబ్ రాథ్, హంసపార్, పద్మావతి, రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, వికారాబాద్ జంక్షన్‌లో నిలిపే పల్నాడ్ ఎక్స్‌ప్రెస్‌ను తాండూరుకు పొడిగించాలని, తాండూరు నుంచి షోలాపూర్ వరకు ఉదయం వేళ ప్యాసింజర్ రైలును నడిపిస్తే రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడుతుంది. మండల కేంద్రమైన బషీరాబాద్ (నవాండ్గి) రైల్వే స్టేషన్‌లో రాయలసీమ, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఉంది. పాత తాండూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకుండా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం ఆస్తి నష్టం జరగకుండా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఈ సమస్యలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివే. అదేవిధంగా గతంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తాండూరులో డస్ట్‌ను పరిశీలించగా దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని గుర్తించారు. ఈ సమస్యతో తాండూరులో శ్వాసకోశ, ఉదర కోశ, ఊపిరితిత్తుల వంటి రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించి ప్రత్యేక నిధులు రాబట్టి శాశ్వత పరిష్కరం చూపాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతో కొనసాగుతున్న భారీ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభించడం లేదు. తాండూరు ప్రాంతంలో విస్తరించిన పెన్నా, చెట్టినాడు, ఇండియా సిమెంట్ కర్మాగారాలుండగా ఇందులో ప్రధాన విభాగాలలో గానీ, ఒక మోస్తారులో ఉన్న ఉద్యోగాలు, చివరకు రోజు వారీ వేతనంతో కూడిన ఉద్యోగాలను ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నారు. ఈ విషయంలో ఎంపీ పరిశ్రమల అధికారులతో చర్చించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సివుంది. అదేవిధంగా తాండూరు మండలం జినగుర్తి గేటు వద్ద పారిశ్రామిక వాడ సర్వేలకే పరిమితమైంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, తాండూరు కాగ్నా నది సమీపంలోనున్న ఆచార్య రంగ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ కోర్సుల కళాశాలను ఏర్పాటు, కొత్తగా ఏర్పాడిన గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు ప్రత్యేక సిబ్బంది నియమకం చేపట్టాలని కోరుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం ఉన్న ప్రాంతాలైన సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు, రాజీవ్ గృహకల్ప, ఎన్టిఆర్ కాలనీ వాసులకు ఉపాధి హమీ పథకం వర్తించేలా చూడాలి.

మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరం

శంషాబాద్ రూరల్, జూలై 18: మాదకద్రవ్యాలు సమాజానికి అత్యంత ప్రమాదకరమని శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దషాపూర్ పీఎస్ఆర్ (ఫార్మసీ) కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరేందర్‌రెడ్డి

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

కడ్తాల్ : డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని సీఐ శివప్రసాద్ కోరారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, సమస్యలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై వరప్రసాద్, ప్రిన్సిపాల్ రవి, తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేసి సంబురాలు చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, జూలై 18: బేషరతుగా రైతుల రుణాలు మాఫీ చేసి సంబురాలు చేసుకోవాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవటానికి రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం సంబురపడుతుందే తప్ప రైతులకు మాత్రం అనుకున్న మేరకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా చేట్టిందన్నారు. రూ.35వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా ఐదారు వేల కోట్లతో సరిపెట్టుకుందన్నారు. సమగ్రంగా సర్వే నిర్వహించి రైతులకు రుణ మాఫీచేస్తే బాగుంటుందన్నారు. రైతుల సంక్షేమం విస్మరించిన ప్రభుత్వాలకు మనుగడ ఉండబోదని విమర్శించారు. వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల బాలాజీనగర్‌లో వీధికుక్కల దాడిలో ఓ చిన్నారి మృతి చెందడం బాధాకరమన్నారు. తన పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో వీధికుక్కల నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా అందరు కలిసి కట్టుగా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశలో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్ మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హంసరాణి కృష్ణ గౌడ్, అమరం సరస్వతీ మోహన్ రెడ్డి బేరి బాల్‌రాజ్, జైపాల్ రెడ్డి, హేమంత్ రెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, సేంజీవ గౌడ్, బాబు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి.

భయం గుప్పిట్లో జలాల్‌పూర్



దాయాదుల దాడిలో వినియోగించిన చక్రాల కత్తులు (ఫైల్)



మొహర్రం వేడుకల్లో దయాదులు దాడులకు దిగిన ప్రాంతం

బషీరాబాద్, జూలై 18: మండలంలోని జలాల్‌పూర్ గ్రామం భయం గుప్పిట్లో మగ్గుతోంది. మొహర్రం పండుగ వేడుకల్లో మంగళవారం అసైదులా ఆడుతుండగా పాత కక్షలతో తలెత్తిన గొడవలో ఇరు కుటుంబాల దాయాదులు రెచ్చిపోయి చక్రాల కత్తులు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని భయానక వాతావరణం సృష్టించిన విషయం తెలిసిందే. గ్రామంలో చక్రాల కత్తులు, కర్రలను ఉపయోగించి రెండు కుటుంబాల వ్యక్తులు మొహర్రం పండుగలో దాడులకు దిగడంతో గాయాలవడం ప్రత్యక్షంగా చూసిన స్థానిక జనానికి భయం వీడటంలేదు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మొహర్రం పండుగలో చోటు చేసుకున్న సంఘటనపై గ్రామస్తులు భయకంపితులవుతున్నారు. అందరూ పండగ వాతావరణంలో ఉండగా, ఇరు కుటుంబాల దాయాదులు దాడులను గుర్తుచేసుకుంటూ భయందోళన చెందుతున్నారు. ఆ సమయంలో మహిళలు, చిన్నారులు ఏం జరుగుతుందో తెలియక ఇళ్లకు పరుగులు పెట్టారని ఇదెక్కడి దాడులంటూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ దాయాదుల గొడవలో ఎక్కడికి దారితీస్తుందోనని ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఈ దాడులకు దిగిన పరిసర ప్రాంతంలో రెండోరోజు గురువారం కూడా జనం సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించించడం గమనార్హం. ఇక్కడి ప్రాంతానికి ఎవరైనా కొత్తవారు వస్తే బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోంచి చూస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్, సిబ్బందితో గ్రామానికి చేరుకుని దాడులకు పాల్పడిన ఇరు కుటుంబాలతో విచారణ జరిపి వెళ్లారు. ప్రజల్లో భయం పోగొట్టేందుకు పోలీసులు మేమున్నామనే భరోసా కల్పిస్తే బాగుంటుందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమైంది. కాగా దాయాదులు చక్రాల కత్తులను పండుగలో అసైదులా ఆడేందుకు స్థానికంగా ఒక వ్యక్తి వద్ద ప్రత్యేకంగా 30 వరకు చేయించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. చక్రాల కత్తులను పోలీసులకు దొరకకుండా బావిలో పడేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇరు కుటుంబాల పరస్పర ఫిర్యాదులపై 11మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గీతా పారాయణం

వికారాబాద్, జూలై 18: గీతా వాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అశాడ మాస భగవద్గీత పారాయణంలో భాగంగా చివరి రోజు సందర్భంగా వైభవలక్ష్మి దేవాలయంలో పారాయణం నిర్వహించినట్లు గీతా వాహిని అధ్యక్షురాలు శ్రీదేవి సదానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గీతా పారాయణం ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సమాజంలో భగవద్గీత పారాయణం చేయడం వల్ల ఆధ్యాత్మికత ధార్మికత పెంచేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్వాహకురాలు స్వరూప రమేష్ మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం కూడా పూర్వజన్మ సుకృతంగా అభివర్ణించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి మాట్లాడుతూ అమెరికా నాసా వంటి సంస్థలు కూడా రామా సేతు నిర్మాణం నిజమేనని నిర్ధారించినా కొంత మంది సెక్యులర్ వాదులు మూఢనమ్మకాలు నమ్మం సైన్స్‌నీ మాత్రమే నమ్ముతామని చెప్పి ఇప్పుడు నాసా చెప్పిన విషయాన్నీ అంగీకరించపోవడంతో వారు హిందూ మతంపై ఎంత విషం చిమ్ముతున్నారో తెలిపేందుకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో అలయ అర్చకులు విక్రమ్, గీతా వాహిని, ఉపాధ్యక్షురాలు మోనిగారి లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, వరలక్ష్మి, ఝాన్సీరాణి, మాధురి, లక్ష్మి, విజయ, సంజీవరాణి, సరళ, సునీత, జ్యోత్స్న, నాగరాణి, అనురాధ, కరుణ, శిరీష, సరిత, రంజిత, సంతోష, గీతా వాహిని బృందం, భక్తులు పాల్గొన్నారు.



గీతాపారాయణంలో పాల్గొన్న మహిళలు

లెక్క తేలాల్సిందే..!

- చైర్‌పర్సన్, కమిషనర్ మధ్య కోల్డ్‌వార్
- తాండూరు మున్సిపాలిటీలో కొత్త పంచాయితీ



చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్



కమిషనర్ విక్రం సింహారెడ్డి

తాండూరు, జూలై 18: తాండూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, కమిషనర్ మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. మున్సిపాలిటీలో ఖర్చు వివరాలను చైర్‌పర్సన్ అడిగితే కమిషనర్ చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ వివాదం చివరకు ఎమ్మెల్యే చెంతకు చేరింది. అక్కడ కూడా ఇద్దరి మధ్య సయోధ్య కుదరలేదని తెలిసింది. మున్సిపాలిటీ లెక్కలు తెల్చాల్సిందేనని చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ పట్టుబడుతున్నారు. చివరకు అకౌంట్ గదికి తాళం వేసుకునే పరిస్థితికి దారి తీసింది. కౌన్సిల్‌కు తెలపకుండానే మున్సిపల్ సాధారణ నిధులను డ్రా చేయడం వల్ల చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తున్నారు. నాలుగు నెలలుగా మున్సిపాలిటీల పాలన ఇష్టానుసారంగా జరుగుతుందని చైర్‌పర్సన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మున్సిపాలిటీ కమిషనర్, చైర్‌పర్సన్ ఇద్దరూ కలిసి సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఇద్దరికీ సూచించినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్‌కు సహకరించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించినట్లు సమాచారం. సమన్వయం లేని కారణంగా మున్సిపల్ సమావేశాలు ఆర్నేళ్లుగా జరగడం లేదు. కమిషనర్ పాలకవర్గాన్ని కాదని ఒంటెద్దు పోకడలకు పోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



కేశంపేట : నియమాక పత్రం అందుకుంటున్న నర్సింహ

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక



ఉత్తర్వులు అందుకుంటున్న ఆంజనేయులుగౌడ్, లక్ష్మీపతిగౌడ్

ఆదిభట్ల/చేవెళ్ల, జూలై 18 : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈమేరకు ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన పండల లక్ష్మీపతిగౌడ్‌ను సభ్యుడిగా నియమిస్తూ గురువారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ నగరంలో ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీపతిగౌడ్ ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేశారు. బీజేపీలో కూడా మండల, జిల్లా స్థాయిలలో పలు పదవులు నిర్వహించారు. అతని పనితీరుతో సంతృప్తి చెందిన రాష్ట్ర నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో భాద్యలప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే చేవెళ్ల మండలంలోని అల్లావాడ గ్రామానికి చెందిన తాళ్ల ఆంజనేయులుగౌడ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేశంపేట మండలం కొనాయపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సోప్పరి నర్సింహను రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

పాఠశాలల అభివృద్ధికి సహకారమందిస్తా

కొందుర్గు, జూలై 18: షాద్‌నగర్ నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్ళిన జి.చెన్నారెడ్డి, ఎం.మోహన్‌రావు, కె.ప్రసన్నకుమరి, పి.జ్యోత్స్న, ఎస్.హాన్య, ఎస్.రాధమ్మ, ఎస్.స్వాములు, ఎ.రమేష్ కుమార్, వి.హనుమంత్, కె.కుర్మారావులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మాజీ వైస్ఎంపీపీ రాజేష్ పటేల్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంఈవో కిష్టారెడ్డి, విశ్రాంత ఎంపీడీవో డాక్టర్ అంజనేయులు, హెచ్ఎం గాయిత్రిదేవి, విద్యాసాగర్, శ్రీధర్‌రెడ్డి, కె నర్సింలు, కె.రాజేందర్, శేఖర్‌గౌడ్, శ్రీను, రామకృష్ణ, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుణల మాఫీ జీవోను సవరించాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి,జూలై 18: పంట రుణాల మాఫీ విషయంలో జారీ చేసిన 567 జీవోలోని కొన్ని అంశాలను సవరించి రూ.2లక్షల వరకు రుణం పొందిన రైతులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, ఒకే వ్యక్తికి రుణమాఫీ చేయడం వల్ల ఇతరులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆధార్, పాసుబుక్ డేటా, రేషన్‌కార్డులేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయని తెలిపారు. పట్టా పాసు పుస్తకాల కోసం ధరణిలో దరఖాస్తులు పది లక్షలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణ మాఫీ చేసిన బ్యాంకర్లు కోత్రీలు పెట్టే అవకాశం ఉందని, అందుకు రైతుల సేవింగ్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, వెంకటయ్య, అనంతయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



మద్దూరు : రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



శంషాబాద్ : మల్కారం రైతువేదిక నుంచి వీసీ వీక్షిస్తున్న కలెక్టర్ శశాంక, వ్యవసాయాధికారులు



యాచారం : వీసీని వీక్షిస్తున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, స్పెషలాఫీసర్ పద్మజారాణి

ఊరూవాడా 'రుణమాఫీ' సంబురాలు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- రైతువేదికల్లో కలెక్టర్లతో కలిసి సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన అధికారులు



కడ్తాల : రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు



కేశంపేట : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి



కొందుర్గు : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు తదితరులు



చౌదరిగూడ : రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు అధికారులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 18: ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తానన్న సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి.. మాట నిలబెట్టుకున్నారని, ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపుమేరకు గురువారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలో రైతు రుణమాఫీ సంబురాలు జరిగాయి. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో సీఎం, ఎమ్మెల్యే శంకర్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తా వరకు డీజే పాటలు, టపాసుల మోతల మధ్య భారీ ర్యాలీని నిర్వహించారు. అంబేడ్కర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సోనియా, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు రైతులు మరోసారి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏకకాలంలో రెండవసారి రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు రైతు బిడ్డ రేవంత్‌రెడ్డిలు రైతులకు అండగా రుణమాఫీ చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, పి. వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, పి. రఘు, కొంకళ్ళ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : మల్కారం రైతు వేదికలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి కలెక్టర్ శశాంక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీసీ ద్వారా రైతులతో కలిసి వీక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి, మల్కారం పీఏసీఎస్ ఛైర్మన్ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరయ్యారు. శంషాబాద్ మండలంలో 1028 మందికి రూ.4.89 కోట్లు మాఫీ అయినట్లు కలెక్టర్ చెప్పారు. మల్కారం రైతు వేదికలో కలెక్టర్ శశాంక ఓ మహిళా రైతును మీకు రైతు రుణమాఫీ జరిగిందా? అని ప్రశ్నించారు. నాకు తెలవదు సారూ.. అంటూ ఆమె సమాధానం చెప్పారు. అక్కడే ఉన్న వ్యవసాయాధికారులు ఆమె వివరాలు లిస్టులో లేదు సార్, మరోసారి చెక్ చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఛైర్మన్ సిద్దేశ్వర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నృత్యం చేశారు. బాణసంచా పేలుస్తూ తిమ్మాపూర్ వద్ద గల రైతువేదిక వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అక్కడ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏడీఏ రాజారత్నం, స్థానిక వ్యవసాయాధికారి గోపాల్, ఎంపీడీవో అరుంధతీ, కమిషనర్ బాలాజీ, నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, ప్రభాకర్, సిద్దార్థరెడ్డి, ఎల్లారం శేఖర్‌రెడ్డి, ఇందూరి శ్రీనివాస్, కర్రోళ్ల సురేందర్, లింగంనాయక్, దయానంద్‌గుప్త, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందని మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి,



తలకొండపల్లి : పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు



ఆమనగల్లు : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్ అన్నారు. అల్వాల రైతు వేదికలో సీఎం వీసీ వీక్షించారు. అల్వాల మాజీ ఎంపీటీసీ సురేష్‌రెడ్డి రైతులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

కొందుర్గు : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు. ఏవో పద్మావతి, ఏఈవోలు వాసవి, లక్ష్మీకాంత్, కోటేశ్వర్, అనూష, ట్రాన్స్‌కో ఏఈలు వినోద్, రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులతో కలిసి రైతులు సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఎంపీడీవో ప్రవీణకుమార్, నాయబ్ తహసీల్దార్ ఆర్షద్, ఏవో కృష్ణమోహన్, ఏఈవోలు స్వాతి, గౌరిప్రియ, రాజేశ్వరి నాయకులు పాల్గొన్నారు.



కొత్తూర్ : నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల రైతు వేదికలో రైతులు రుణ మాఫీ సంబరాలు చేసుకున్నారు. మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి హాజరై సీఎం, ఎమ్మెల్యే శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలో రైతు రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు టి.జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ అనితవిజయ్, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఆర్ఎస్ఎస్ఎం కో-ఆర్డినేటర్ నారాయణ, జిల్లా నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, ఎంగళి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్‌లతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళపల్లిలో సీనియర్ నాయకుడు కొప్పు జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో కృష్ణగౌడ్, లింగారెడ్డి, మాధవరెడ్డి, జి.నర్సింహ, శేఖర్‌రెడ్డి, గోపాల్, జంగిరెడ్డి, నర్సింహ, యాదయ్య, తదితరులున్నారు. పట్టణంలోని రైతువేదికలో రైతు నేస్తం రైతు రుణ మాఫీ-2024 నిధుల విడుదల కార్యక్రమం పండుగలా



షాబాద్ : అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయకులు, రైతులు తదితరులు

నిర్వహించారు. సీఎం వీడియోకాన్ఫరెన్స్‌కు ఏవో అరుణకుమారి ఆధ్వర్యంలో రైతులు వీసీని వీక్షించారు.

కడ్తాల్ : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్, సోనియా, రాహుల్, రేవంత్‌లకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు తదితరులున్నారు. కడ్తాల రైతువేదికలో ఏఈవో శ్రీలత ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులు వీడియోకాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఏడీఏ ఆదిలక్ష్మి, ప్రత్యేకాధికారి రామేశ్వరిదేవి, ఎంపీడీవో సుజాత, ఏఈవోలు నాయకులు తదితరులున్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

తలకొండపల్లి : రుణమాఫీని హర్షిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మోహన్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, భగవాన్‌రెడ్డి, దామోదర్, సురేశ్, రవీందర్, అజీం, కృష్ణ, తదితరులున్నారు. తలకొండపల్లి రైతువేదికలో ఏవో రాజు ఆధ్వర్యంలో వీసీ వీక్షించారు. పీఏసీఎస్ ఛైర్మన్ కేశవరెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, నాయకులు మోహన్‌రెడ్డి, యాదగిరి, అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : దుబ్బచర్లలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కేఎల్ఆర్

మాడ్గుల : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నుంచి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నల్లచెర్వు, ఇర్విన్, నాగిళ్ళ కలకొండతో పాటు పలు గ్రామాల్లో రైతుల సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీనియర్ నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, మాడ్గుల మాజీ సర్పంచ్ కట్ట మాదయ్య గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పట్టణ కేంద్రంలోని రైతువేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆర్డీవో సాయిరాం, ఎంపీడీవో హిమబిందు, ఏడీఏ రమాదేవి, డీటీ రాజేంద్రతోపాటు ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పీసీసీ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, సున్నపు వసంతం, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఏవో తులసి, ఏఈవోలు, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ఎడ్లబండిపై రైతులు, నాయకులతో కలిసి ర్యాలీలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

శంకర్‌పల్లి : మోకిల రైతు వేదికలో రైతులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని వీసీని వీక్షించారు. ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఇన్‌చార్జి ఏవో చైతన్య, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, రమ్య, మౌనిక, శీల. యూనియన్‌బ్యాంకు మేనేజర్ సురేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్. నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్‌పల్లి చౌరస్తాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాలింగపురంలో నాయకుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఉదయ్‌మోహన్‌రెడ్డి, ప్రకాశ్, యాదయ్య, బొల్లారం వెంకట్‌రెడ్డి, సురేష్, వెంకట్‌రెడ్డి, కాశెట్టి మోహన్, తదితరులు ఉన్నారు.

షాబాద్ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని పీసీసీ ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్‌కు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రైతులకు స్వీట్లు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీడీవో అపర్ణ, ఏవో వెంకటేశం, భారతీయ కిసాన్‌సంఘ్ మండలాధ్యక్షుడు యాదవరెడ్డి, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, నాయకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ప్రతి పక్షాల దిమ్మతిరిగేలా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేసిందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్ఆర్ అన్నారు. దుబ్బచర్ల రైతువేదికలో సీఎం వీసీని మండలంలోని రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి వీక్షించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీష్‌రావు తన రాజీనామాను తయారు చేసుకోవాలన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, పీసీసీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌ముదిరాజ్, నాయకులు కృష్ణానాయక్, విఠల్‌నాయక్, రఘుపతి, రామచేందర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాజునాయక్, ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీవో శైలజారెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



చేవెళ్ల : రైతువేదికలో సీఎం ప్రసంగం వింటున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు



షాద్‌నగర్ రూరల్ : వెలిజర్లలో పాలాభిషేకం చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం : రుణమాఫీతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని రైతు పక్షపాతిగా ప్రసిద్ధికెక్కిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఉప్పరిగూడ రైతువేదిక వరకు ఎడ్లబండిపై ర్యాలీగా వెళ్లి అక్కడ వీడియో ద్వారా జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి రైతుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో కె.అనంతరెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, ఏడీఏ దివ్యజ్యోతి, ఏవో వరప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో వెంకటమ్మ, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్లు స్రవంతి, నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంగ, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మహిపాల్, అమృతాసాగర్, మంగమ్మ, ఏదుల్ల పాండురంగారెడ్డి, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్‌రెడ్డి, కోడూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల : మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్ర్కీన్‌లో రేవంత్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. పీఏసీఎస్ ఛైర్మన్ హన్మంత్‌రెడ్డి, ప్రత్యేకాధికారి సుభాషిణి, ఎంపీడీవో బాలశంకర్, వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ, ఎంపీవో మధుసూదనాచారి, ఏఈ సత్యనారాయణ, ఏపీవో శోభ, సీసీ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వేణుగోపాలరావు, జెనిగె వెంకటేష్, వి.రాంరెడ్డి, పి.రమేష్, ఏఈవోలు లింగస్వామి, సరిత, సాయిసిరి తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని చౌదర్‌పల్లి రైతువేదికలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి పద్మజారాణి, సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌లతో పాటు వివిధ గ్రామాల రైతులు వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. సీఎం రుణమాఫీపై మాట్లాడుతుండగా రైతులు చప్పట్లతో హర్షం వెలిబుచ్చారు. అనంతరం జడ్పీ సీఈవో, ప్రత్యేకాధికారి. ఎంపీడీవో, వ్యవసాయాధికారులు రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటారు.



శంకర్‌పల్లి : రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అభినందనీయం

చేవెళ్ల, జూలై 18 : గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావడం అభినందనీయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధి రామన్నగూడకు చెందిన యువ నాయకుడు పెద్దోళ్ల దయాకర్ సొంత డబ్బులు రూ.30వేలతో గ్రామంలో వీధిలైట్లు, గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు వేతనాల కింద రూ.30వేలు గ్రామ కార్యదర్శి విజేయందర్‌కు అందజేశారు. దయాకర్‌ను గ్రామస్తులు అభినందించారు. మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వీధిలైట్లు అందిస్తున్న దయాకర్

ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి : డీసీపీ

కొందుర్గు, జూలై, 17: మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను డీసీపీ గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా చూసుకోవాలని, గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే సంసిద్ధులు కావాలన్నారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్సై కృష్ణయ్య ఉన్నారు.

సంక్షిప్తంగా..

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతోపాటు జిల్లేడ్, తూంపల్లి గ్రామాల్లో పీర్ల ఊరేగింపు వేడుకలను నిర్వహించారు. హిందూ ముస్లిం తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. పీర్లకు దట్టీలు సమర్పించి మలీజా, మటికలతో ఫతేహాలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో మండలంలో సందడి నెలకొంది.

మొయినాబాద్ రూరల్ : నేటి ఫొటోగ్రాఫర్లు నూతనమైన, నాణ్యత కలిగిన ఫొటోలను చిత్రీకరించేందుకు దృష్టి సారించాలని రంగారెడ్డి జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివలింగంగౌడ్ సూచించారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను పూజలు చేసిన అనంతరం ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణుగౌడ్, వివిధ మండలాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు కార్యవర్గసభ్యులున్నారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని కిరణ గురూ మద్రాస్ ఐఐటీలో డాటా సైన్స్ విభాగంలో సీటు సాధించింది. పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినికి ఐఐటీ మద్రాస్‌లో సీటు రావడం గర్వకారణమన్నారు. విద్యార్థినిని టీచర్లు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

క్రైం కార్నర్

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

- బంగారు ఆభరణాల కోసం మరో మహిళతో కలిసి హతమార్చిన వ్యక్తి
- సొత్తు, నగదు రికవరీ.. రిమాండ్‌కు తరలింపు

షాద్‌నగర్ రూరల్, జూలై 18: కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బొదునంపల్లి శివారులో ఈనెల 12న జరిగిన మహిళ హత్య కేసులో గురువారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బొదునంపల్లికి చెందిన పార్వతమ్మ(45) భర్త ఐదేళ్ల క్రితం మృతిచెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఈక్రమంలో ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి ఎందిన కుందేళ్ల అంజమ్మ, కేశంపేట మండలం పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన పెబ్బె యాదయ్యలు గ్రామాల్లో వీధి నాటకాలు వేసే వారి ముఖాలకు రంగులు(మేకప్) వేసేవారు. మూడు నెలల క్రితం బొదునంపల్లిలో వీధినాటకాలు వేయగా వారిద్దరూ అక్కడికి వెళ్లి మూడురోజులు ఊళ్లోనే ఉన్నారు. ఆ సమయంలో పార్వతమ్మతో వారికి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత వారితో ఆమె ఫోన్‌లో తరచూ మాట్లాడుండేది. ఈ క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. దాంతో పార్వతమ్మ, యాదయ్య మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. కొన్ని రోజుల క్రితం పార్వతమ్మ తనకున్న వ్యవసాయ పొలం విక్రయించి వచ్చిన డబ్బులతో కందుకూరు గ్రామంలో ఒక ఇల్లు కొనుగోలు చేసింది. మిగతా డబ్బుతో బంగారు, వెండి ఆభరణాలు చేయించుకుంది. అయితే, ఆమె ఆభరణాలు ధరించడంతో అంజమ్మ, యాదయ్య కన్ను వాటిపై పడింది. అయితే, పార్వతమ్మను రూ.50వేలు అప్పు కావాలని అంజమ్మ అడగ్గా ఆమె నిరాకరించింది. ఈ విషయం అంజమ్మ యాదయ్యకు చెప్పింది. అనంతరం ఆమెను ఎలాగైనా చంపి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాలని కలిసి పథకం వేశారు. ఈనెల 12న దావత్ చేసుకుందామని చెప్పి పార్వతమ్మను వేముల్‌నర్వ గ్రామానికి రప్పించుకున్నారు. అంజమ్మ వేముల్‌నర్వ గ్రామ శివారులో ఉన్న నంబయ్య గుట్ట శ్రీ వేణుగోపాల స్వామి గుడికి పార్వతమ్మను తీసుకెళ్లింది. యాదయ్య కేశంపేట వెళ్లి మద్యం కొనుగోలు చేసి, మటన్, చేప ఫ్రై తీసుకువచ్చాడు. ముగ్గురూ కలిసి మద్యం తాగారు. పార్వతమ్మకు ఎక్కువ తాగించారు. మత్తులోకి జారుకోగానే యాదయ్య తువ్వాలుతో పార్వతమ్మ గొంతుకు చుట్టి గట్టిగా బిగియబట్టాడు. అంజమ్మ గట్టిగా పట్టుకుంది. అనంతరం పార్వతమ్మ తలపై బండరాయితో బలంగా కొట్టి చనిపోయినట్లు నిర్ధారించుకున్నారు. మెడలో ఉన్న బంగారుగొలుసు, జత బంగారు చెవి కమ్మలు, నాలుగు బంగారు చెవి పుల్లలు, జత వెండి కాళ్ల కడియాలు అపహరించారు. పార్వతమ్మ సెల్‌ఫోన్ సిమ్‌కార్డును విరగ్గొట్టారు. అనంతరం ఫోన్‌ను పొదల్లో పడేశారు. ఈమేరకు పోలీసులు స్థానికుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు నిందితులను అదుపులోకి తీసుకొని 35 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి ఆభరణాలు, బైక్, మూడు సెల్‌ఫోన్లు, దొంగిలించిన సొమ్ము కుదువ పెట్టగా వచ్చిన నగదు రూ.లక్షా 96వేల 800 స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. దొంగిలించిన సొత్తు విలువ రూ5.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

చేవెళ్ల, జూలై 18 : ఓ ఇంట్లో ఎలక్ట్రికల్ వర్క్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా అనంతగిరిపల్లికి చెందిన ఉమ్మెంతాల నాగేశ్(40) ఎలక్ట్రీషియన్. మూడు రోజుల నుంచి చేవెళ్ల మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలోని తంగడ్‌పల్లికి చెందిన ఆలంపల్లి చంద్రయ్య కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం కరెంటు వైర్ సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నాగేశ్ భార్య రాధ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

మాడ్గుల, జూలై 18 : మండలంలోని ఇర్విన్ గ్రామసమీపాన పోలీసులు గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని ఇర్విన్ గ్రా మానికి చెందిన డ్రైవర్ మాదాసు అనిల్.. అదే గ్రామానికి చెందిన బా తుక కొండల్ ట్రాక్టర్ యజమానిగా గుర్తించారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యా ప్తు జరుపుతునట్లు సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు.

హత్యకేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కేశంపేట, జూలై 18: భూ తగాదాలతో జరిగిన గొడవలో ఓ వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా, బాధితుడి కుటుంబ సభ్యులను తిట్టనందుకు.. నిందితుడి భార్యకు రూ.2వేల జరిమానా విధించినట్లు జిల్లా 9వ అదనపు జిల్లా న్యాయాధికారి హరీష తీర్పు వెల్లడించారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తొమ్మిదిరేకులు గ్రామ పంచాయతీ నాన్యతండాకు చెందిన వద్యావత్ భాస్కర్, బాదావత్ రమేష్‌లకు భూమి తగదాలు ఉన్నాయి. ఈక్రమంలో 23 ఏప్రిల్ 2021న వారిమధ్య గొడవ జరిగింది. బాదావత్ రమేష్, వద్యావత్ భాస్కర్‌ను రోకలి బండతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తగాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భాస్కర్ మృతిచెందాడు. అంతేకాకుండా బాధితులను రమేష్ భార్య బూతులు తిట్టింది. కేసు నమోదు చేసిన అప్పటి షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ సాక్ష్యాధారాలతో చార్జీషీట్‌ను కోర్టులు దాఖలు చేశారు. పీపీ రఘు బాధితులవైపు వాదనలు వినిపించి నేరం రుజువు చేశారు. గురువారం నిందితుడికి శిక్షతో పాటు జరిమానా విధించారు. అతడి భార్యకు రూ. 2వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్లు..

మాడ్గుల, జూలై 18 : అదనపు కట్నం కావాలని భార్యను శారీరకంగా, మానసికంగా వేధించటంతో.. ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో నిందితుడైన భర్తకు 7ఏళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధించినట్లు గురువారం సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గండికోట మంజుల భర్త లక్ష్మయ్య తాగుడుకు బానిసై అదనపుకట్నం తీసుకురమ్మని భార్యను వేధించేవాడు. దాంతో ఆమె 25 జనవరి 2017న ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించింది. ఈమేరకు పోలీసుల విచారణానంతరం నిందితుడు లక్ష్మయ్యకు ఏడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువడినట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తాం

ఆమనగల్లు/శంషాబాద్/కేశంపేట, జూలై 18: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన కార్మికులు అన్నారు. ఆరు నెలలుగా బిల్లులు, జీతాలు అందక గోస తీస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. శిబిరాన్ని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య సందర్శించి దీక్షలో కూర్చున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు అన్నారు. కేశంపేటలో కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు. సీఐటీయూ నాయకుడు నీరటి మల్లేష్‌తో పాటు కార్మికులున్నారు. అలాగే పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు డిమాండ్ చేశారు. కేశంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి.

'అంగన్‌వాడీ' సేవలను వినియోగించుకోవాలి

చౌదరిగూడ/యాచారం/కేశంపేట/కొందుర్గు , జూలై 18: అంగన్ వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి ,పెద్దఎల్కిచర్ల గ్రామాల్లో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచర్ తిర్మలమ్మ, ఆయాలు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతిశ్రీ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు అమ్మమాట-అంగన్‌వాడీ బాటను గున్‌గల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. రెండేళ్లు దాటిన పిల్లల ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్లనందించారు. కేశంపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీచర్లతో కలిసి బొదునంపల్లిలో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న కొందుర్గు మండలం పులుసుమామిడి, మహదేవ్‌పూర్, బైరంపల్లి, రాంచంద్రాపూర్, ఉత్తరాస్‌పల్లిలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు.